క్లుప్తంగా

రైతులు అవగాహన సదస్సుకు రావాలి

పటాన్‌చెరు టౌన్: రైతులు భూభారతి అవగాహన కార్యక్రమానికి రావాలని పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావు పేర్కొన్నారు. శనివారం ఉ. 10 గంటలకు పటాన్‌చెరు డివిజన్‌లోని మైనారిటీ ఫంక్షన్ హాల్ వెనుక ఉన్న అంబేడ్కర్ భవన్‌లో అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సదస్సు కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు.

వెండి శఠగోపం బహూకరణ



శఠగోపం అందజేస్తున్న దాతలు

నారాయణఖేడ్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయానికి మెదక్ జిల్లాలోని పెద్దశంకరంపేటకు చెందిన భక్తులు వజ్రమణి, ఆమె కుమారులు వెంకటేశం, శ్రీనివాస్ రూ.25 వేల విలువచేసే వెండి శఠగోపం బహూకరించారు. ఆలయ కమిటీ బాధ్యులు వారిని సన్మానించి సాయినాథుడి కృపాకటాక్షాలు ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం దాతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భారత్ ఎలక్ట్రానిక్స్‌కు ముగ్గురు ఎంపిక



బీఈఎల్‌కు ఎంపికైన విద్యార్థులు

పటాన్‌చెరు: మండలంలోని రుద్రారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు మరో ఘనత సాధించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈసీఈ విభాగం చివరి ఏడాది విద్యార్థులు ముగ్గురు ప్రాంగణ నియామకాల్లో రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్)కు ఎంపికైనట్లు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఐదు సంవత్సరాల పదవీ కాలానికి ఫిక్స్‌డ్ టర్మ్ ఇంజనీర్స్ (ఉఐఐగ్రేడ్)గా ఎంపికైనట్లు తెలియజేశారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బీఈఎల్ నిర్వహించిన రాత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూల వంటి కఠినమైన ప్రాంగణ నియామక ప్రక్రియ ద్వారా ఎంపిక చేశారన్నారు. ఈ సమాచారాన్ని అధికారికంగా బీఈఎల్ మేనేజర్ (హెచ్ఆర్)సభ్య కార్యదర్శి 23న అధికారిక లేఖ ద్వారా గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్‌కి తెలియజేశారన్నారు.

వలస కార్మికుల చట్టాన్ని అమలు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్

పటాన్‌చెరు టౌన్: వలస కార్మికుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ డిమాండ్ చేశారు. గురువారం పటాన్‌చెరులోని శ్రామిక్‌భవన్‌లో వలస కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలస కార్మికులను బానిసలా పరిశ్రమల, సంస్థల యజమానులు చూస్తున్నారని మండిపడ్డారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వలస కార్మికుల చట్టాన్ని నీరుగార్చిందన్నారు. పని గంటలు, కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, సెలవులు వీళ్లకు అమలు చేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. మే 20 జరిగే సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రాజయ్య, నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు గుమ్మడిదలలో గ్రామసభ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 109లో నూతనంగా ఏర్పాటు చేయనున్న పారిశ్రామికవాడకు భూ సేకరణ నిమిత్తం శుక్రవారం ఉదయం 10 గంటలకు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పరమేశం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గ్రామసభకు ఆసక్తి గలవారు సకాలంలో పాల్గొని డాక్యుమెంటులను చూపాలని కోరారు.

ఇసుక రవాణాతో ఇబ్బందులు

సంగారెడ్డి టౌన్ : అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఇసుక రవాణాతో ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ఎటువంటి జాగ్రత్తలు లేకుండా ప్రధాన రహదారిపై ట్రాక్టర్లు, టిప్పర్ల ఇసుకను తరలిస్తున్నారు. ఇసుకపై ఎలాంటి కవర్ కప్పకపోవడంతో వెనకాల వస్తున్న ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలు ఎదుర్కొంటున్నారు. టిప్పర్లలో ఇసుకను ఇష్టం వచ్చినట్లుగా తరలించడంతో అధికారుల పర్యవేక్షణపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇసుక, కంకరపై కవర్లు కప్పాలంటున్నారు.

వేసవి దుక్కులు పంటకు మేలు

- లోతు దుక్కులతో భూసారం పెంపు.. చీడపీడలకు చెక్
- ఇదే సరైన సమయమంటున్న అధికారులు



ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు

వట్‌పల్లి(అందోల్): వానాకాలం, ఎండకాలం (ఖరీఫ్, రబీ)పంటల తర్వాత తిరిగి వర్షాకాలం వచ్చే వరకు చాలా మంది రైతులు అవగాహన లేక భూమిని దున్నకుండా అలాగే వదిలేస్తారు. దీంతో భూమిలో కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూమికి సత్తువ లేకుండా చేస్తాయి. అదే వేసవిలో లోతు దుక్కులతో బోలెడు లాభాలు ఉన్నాయి. భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. వేసవి కాలంలో లోతు దుక్కులతో వర్షాలకు ముందు భూమిని దున్నడం వల్ల తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి కోతకు గురికాకుండా ఉంటుంది. దీంతో భూమిలో తేమశాతం పెరిగి భూసారం వృద్ధి చెందుతుంది. పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, కలుపు మొక్కల నివారణతో పాటు ఎక్కువ ప్రయోజనాలు సమకూరుతాయి.

వేసవి వానలతో..

వేసవిలో కురిసే వానలను రైతులు సద్వినియోగం చేసుకుని మాగాణి, మెట్ట, బీడు భూములను దున్నుకోవాలి. ముఖ్యంగా వేసవి దుక్కులను లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలి. వాలు, అడ్డంగా దున్నడం వల్ల వాన నీరు భూమిలోకి ఇంకి అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి కూడా ఎక్కువ తేమను గ్రహించి నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. వేసవి లోతు దుక్కులు దున్నే ముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడం వల్ల అవి విసర్జించిన వ్యర్థాలు భూమిలోకి చేరి సేంద్రియ పదార్థంగా మారుతుంది. ఫలితంగా భూసారం పెరుగుతుంది.

పంటలు లేనప్పుడే..

వేసవిలో చాలా వరకు భూమి ఖాళీగా ఉంటుంది. కావున పంటలను ఆశించే అనేక రకాల పురుగులు పంట కోత దశల్లో.. వాటి నిద్రావస్థ దశలో నేల, చెత్తాచెదారం, కోయకాడల్లో ఎక్కువకాలం గుడపుతాయి. అలాగే తెగుళ్లను కలుగచేసే శిలీంద్రాలు భూమి లోపల ఆశ్రయం పొందుతాయి. వీటి శిలీంద్ర బీజాలు భూమిలో నిల్వ ఉంటాయి. వేసవిలో లోతు దుక్కుల వల్ల నిద్రావస్థ దశలో ఉన్న భూమిలోని చీడ పురుగు కోశాలు, గుడ్లు, లార్వాలను పక్షులు, కొంగలు, కాకులు తిని నాశనం చేస్తాయి. అదే విధంగా దుక్కుల వల్ల భూమి లోపల పొరల్లోని శిలీంద్ర బీజాలు మట్టితో పాటు నేలపైకి వస్తాయి. దీంతో బయట అధిక ఉష్ణోగ్రతలతో అవి చనిపోతాయి.

లోతు దుక్కులు చేపట్టాలి



వేసవిలో రైతులు లోతుగా దుక్కులు చేయడంతో వ్యవసాయ భూమి సారవంతంగా మారుతుంది. త్వరలో శాస్త్రవేత్తలతో రైతులకు వ్యవసాయ అధికారుల చేత అవగాహన కల్పిస్తాం. లోతు దుక్కులతో చీడపీడల నివారణతో పాటు నాణ్యమైన పంట దిగుబడి వస్తుంది. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని వేసవిలో లోతు దుక్కులు చేపట్టాలి.

\- శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ వట్‌పల్లి

కొత్త జాబ్ కార్డులు ఇవ్వండి

కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్



కూలీలతో మాట్లాడుతున్న కార్మిక నాయకులు

వట్‌పల్లి(అందోల్): ఉపాధి కూలీలకు కొత్త జాబ్ కార్డులను ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం అందోల్ మండలంలోని అల్మాయిపేటలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింలు మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధి హామీ చట్ట ప్రకారం 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఉపాధి జాబ్ కార్డు పొందే హక్కు ఉందని జాబు కార్డును నిరాకరించడం సరికాదన్నారు. రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ బకాయిలను చెల్లించాలన్నారు. ప్రస్తుతం ఎండల దృష్ట్యా పని ప్రదేశంలో కనీస సౌకర్యాలను కల్పించడంతో పాటు ప్రతి కూలీకి పనిముట్లను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అందోల్ ఏరియా కార్యదర్శి విద్యాసాగర్, సంఘం జిల్లా కమిటీ సభ్యులు జి.రాజు, పోచయ్య, వీరయ్య, కుమార్, సంజీవులు, దశరత్, మొగులయ్య, దుర్గయ్య, సుందరయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అమీరాబాద్ రోడ్డు



కంకర తేలిన రోడ్డు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని అమీరాబాద్ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. చాల్కి–కాకిజన్‌వాడ నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డుపై బీటీ లేచిపోయి కంకర తేలి గుంతలమయంగా మారింది. దీంతో రోడ్డు గుండా రాకపోకలు సాగించే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకర తేలిపోవడంతో వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

రెండో రోజూ పోలీసుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని శివాలయంలో విగ్రహం ధ్వంసమైన ఘటన నేపథ్యంలో రెండో రోజూ పోలీసుల తనిఖీలు కొనసాగుతున్నాయి. చెక్ పోస్టుల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. గ్రామంలోకి వచ్చే వ్యక్తుల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసి అనుమతిస్తున్నారు. 163 సెక్షన్ అమలు చేస్తున్నారు. పోలీసుల పహారాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు చేపడుతున్నారు. ప్రజలు పోలీసులకు అన్ని విధాలా సహకరించాలని ఉన్నతాధికారులు సూచించారు.



ఎమ్మెల్యే దంపతులను సత్కరిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే దంపతులకు సత్కారం

జహీరాబాద్: ఎమ్మెల్యే మాణిక్‌రావు దంపతులను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, సంజీవరెడ్డి, నాయకులు చిన్నారెడ్డి, విజయ్, లక్ష్మణ్, బాబుమియా పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

మునిపల్లి(అందోల్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్ పేర్కొన్నారు. గురువారం 65వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా సదాశివపేట వైపు నుంచి జహీరాబాద్ వైపు ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఇస్మాయిల్‌ఖాన్‌పేట నుంచి బీదర్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో వాహనం తనిఖీ చేశామన్నారు. టిప్పర్, ఇసుకలోడ్‌కు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి బుదేరా పోలీస్ స్టేషన్‌లో పెట్టామన్నారు. టిప్పర్ యజమాని నయింపటేల్, డ్రైవర్ యాదుల్లా పాషాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వ్యక్తి అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన రామచంద్రాపురం పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో నివాసముండే శ్రీరాములు బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం బంధువులు, మిత్రులు వద్ద ఆరా తీసిన ఫలితం లేదు. అతని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేటి నుంచి సమ్మర్ క్యాంపు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం నుంచి వచ్చే నెల 13 వరకు 15 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఎంఈఓ రాంబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ శిబిరంలో శాస్త్రీయ నృత్యం, సంగీతం, కథలు చెప్పడం సాంస్కృతిక కార్యక్రమాలు కుట్లు అల్లికలు చిత్రలేఖనం వ్యక్తిత్వ వికాసం యోగా, ధ్యానం, చదరంగం, ఇండోర్ గేమ్స్, అందమైన చేతిరాత, సైన్స్, గణితం, టీఎల్ఎం, తయారీ ప్రదర్శన అంశాలపై శిక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ ఎన్‌హెచ్ఆర్సీ అధ్యక్షుడిగా రాజనర్సింహులు

న్యాల్‌కల్(జహీరాబాద్): జాతీయ మానవ హక్కుల కమిటీ మండల అధ్యక్షుడిగా రాజనర్సింహులు ఎంపికయ్యారు. గురువారం సంగారెడ్డిలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ జిల్లా అధ్యక్షుడు వినాయక్ పవార్ తెలిపారు. ఈ మేరకు రాజ నర్సింహులుకు నియామక పత్రం అందజేశారన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, మాణిక్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

◆ జాబ్‌మేళా విజయవంతం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని పద్మనాభ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైందని కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఇంటర్, డిగ్రీ, పీజీ పైచదువులు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఎందరో నిరుద్యోగంతో బాధపడుతున్న నేపథ్యంలో వివిధ పరిశ్రమల వారిని సంప్రదించి కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించామన్నారు. చదువుకు తగిన ఉద్యోగాల్లో పదుల సంఖ్యలో సెలెక్ట్ అయ్యారు. ఉద్యోగమేళా నిర్వహించిన పరిశ్రమల యజమాన్యాలను కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజ్ శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అరవింద రావు, నర్సింలు, ప్రవీణ్‌కుమార్, సతీశ్‌కుమార్, రవీందర్, మహేశ్ పాల్గొన్నారు.

◆ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

మునిపల్లి(అందోల్): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దగోపులారం గ్రామ శివారులో మాజీ సీఎం కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను చంటి క్రాంతికిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమేనని, క్రీడాకారులంతా స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. మండల స్థాయిలోనే కాకుండా జాతీయస్థాయిలో తెలంగాణలోని క్రీడాకారులు రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

◆ విద్యార్థికి సన్మానం

జహీరాబాద్ టౌన్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో మండలంలోని శేఖాపూర్‌కు చెందిన షేక్ మహబూబ్ స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించడంతో ఎమ్మెల్యే మాణిక్‌రావు అభినందించి సన్మానించారు. ఎంపీసీ ఫస్ట్‌ఇయర్ ఫలితాల్లో మహబూబ్‌కు 470 మార్కులకు 467 మార్కులు వచ్చాయి. గురువారం క్యాంపు కార్యాలయంలో విద్యార్థికి ఎమ్మెల్యే స్వీట్ తినిపించారు. భవిష్యత్‌లో బాగా చదవాలని సూచించారు.



◆ ఆలయ చైర్మన్‌కు సన్మానం

రాయికోడ్(అందోల్): రాయికడ్‌లోని భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి ఆలయ చైర్మన్ శీ కుల్కర్ణి ప్రభాకర్ రావు (సతీష్ కుమార్)ను బ్రాహ్మణ సంఘం నాయకులు సన్మానించారు. ఇటీవల ఆలయ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో రాష్ట్ర బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య అధ్యక్షులు రామేశ్వర శర్మ, రాష్ట్ర బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వాణి, దేవులపల్లిలు శాలువా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

చలో వరంగల్ స్టిక్కర్ ఉండాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



కారుకు స్టిక్కర్ అంటించిన ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి రూరల్: వరంగల్ రజతోత్సవ సభకు వెళ్లే ప్రతి వాహనానికి చలో వరంగల్ స్టిక్కర్ ఉండాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో రజతోత్సవ సభ చలో వరంగల్ కార్ స్టిక్కర్‌లను కార్యకర్తల వాహనాలకు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి ఇబ్బంది లేకుండా సభకు జనాలను తరలించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, సాయినాథ్, వెంకటేశ్వర్లు, నర్సింలు, గోవర్ధన్ నాయక్, సాబేర్, మల్లేశం, విఠల్, శ్రవణ్, విఠల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర



బండ్ల ఊరేగింపు

నారాయణఖేడ్: చారిత్రాత్మక ర్యాకల్ ఎల్లమ్మ ఆలయ జాతర ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు పురస్కరించుకొని గురువారం సాయంత్రం ఎడ్ల బండ్ల ప్రదక్షిణ చేపట్టారు. సుమారు 50కి పైగా బండ్లతో ఊరేగింపు కొనసాగింది. గ్రామానికి చెందిన భక్తుడు చారి 35 బండ్లను ఊరేగించారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



కేక్‌కట్ చేస్తున్న జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి తదితరులు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి జానకిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ వార్షిక తనిఖీలో భాగంగా కంగ్టికి విచ్చేసి సిబ్బందితో కలిసి కేక్‌కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ సూపరింటెండెంట్ సూర్యకాంత, నాగేందర్, సీఈఓ సీసీ రవికుమార్, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ సుభాష్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ యాదగిరి

సంగారెడ్డి టౌన్: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సంగారెడ్డి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్రతపై శ్రద్ధగా ఉండాలని.. దానికోసం ప్రతి ఒక్కరూ కొంత సమయానికి కేటాయించాలన్నారు. మరుగుదొడ్లను వాడాలని, నీటిని పొదుపుగా వినియోగిస్తూ ఇంకుడు గుంతలకు మళ్లించి భూగర్భ జలాలను పెంచాలన్నారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు



కుస్తీపోటీల్లో తలబడ్డ మహిళలు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్ గ్రామంలో ఎల్లమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా గురువారం కుస్తీపోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో పాల్గొన్న పహిల్వాన్‌లు నువ్వా.. నేనా.. అనేలా ఒకరిపై ఒకరు విరుచుకుపడ్డారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కుస్తీలు ఉత్కంఠగా సాగాయి. పరిసరాల్లోని ప్రజలు, మహిళలు పోటీలు చూడడానికి ఎండను సైతం లెక్కచేయకుండా నిల్చొన్నారు. మహిళలు సైతం పోటీల్లో పాల్గొని కుస్తీపట్టారు. ఫైనల్‌లో గెలుపొందిన పహిల్వాన్‌కు పయోనీర్ మొక్కజొన్న విత్తనసంస్థ ప్రతినిధులు 5 తులాల వెండి కడియం బహుకరించారు.

ఈదురుగాలుల బీభత్సం



పడిపోయిన విద్యుత్ స్తంభాలు



దాబా ముందుభాగంలో కూలిన రేకులు

సదాశివపేట(సంగారెడ్డి): ఈదురుగాలులతో కూడిన వర్షం కురువడంతో పట్టణంలోని సిద్ధాపూర్ కాలనీలో రెండు విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. దీంతో పట్టణంలోని 33కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కరెంట్ స్తంభాలు పడిపోవడంతో.. విద్యుత్ సిబ్బంది పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

మునిపల్లిలో..

మునిపల్లి(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. గురువారం మండలంలోని బుదేరా, తాటిపల్లి, పెద్దలోడితో పాటు ఆయా గ్రామాల్లో ఇదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బుదేరా చౌరస్తా సమీపంలోని తాజ్ దాబా ముందు భాగం రేకుల షెడ్‌తో పాటు పిట్టగోడ కూలింది. ఆయా గ్రామాల్లో పలువురు శిథిలావస్థలో ఉన్న ఇళ్లు కూలి పోయినట్లు తెలిపారు. దీంతో పలు చోట్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గింది.

కేతకీలో సివిల్ జడ్జి పూజలు



పూజలు చేస్తున్న జడ్జి కవితాదేవి, కుటుంబ సభ్యులు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలోని కేతకీ సంగమేశ్వర ఆలయంలో జహీరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఆలయానికి వచ్చిన వారికి పూర్ణకుంభంతో ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి, పూలమాల, శాలువాతో సత్కరించారు.

విద్యార్థినికి అభినందన



అక్షయను సన్మానిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: పటాన్‌చెరు మండలంలోని ముత్తంగి మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ గురుకుల కళాశాల ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అక్షయను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అభినందించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విద్యార్థికి మిఠాయిలు తినిపించి శాలువాతో సత్క రించారు. బైపీసీ సెకండ్ ఇయర్‌లో 1000మార్కులకు 977 మార్కులు సాధించారు. భవిష్యత్తులో డాక్టర్ కావాలని, ఎంబీబీఎస్ చదువుకునేందుకు ప్రభుత్వం సహకరిస్తే విజయం సాధిస్తానన్నారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, కార్యదర్శి శ్రీశైలం, యువత ప్రధాన కార్యదర్శి రాము, అధ్యక్షుడు ఆంజనేయులు విద్యార్థి తల్లిదండ్రులు ఉన్నారు.